ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ



కోవూరు : గంగవరంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కోవూరు : పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా గంగవరం లోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. బాధిత కుటుంబాలకు సంఘీభావాన్ని, సంతాపాన్ని తెలియజేశారు. 'ఉగ్రవాదం వద్దు- శాంతి ముద్దు' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీ కళాశాల ఆవరణ నుంచి ముంబై హైవే రోడ్డు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్బారావు, ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై జరిగిన దాడి పిరికిపంద చర్య అని తెలిపారు. ప్రతిఒక్కరూ దీనిని ఖండించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రావణ్‌కుమార్, ఈసీఈ విభాగాధిపతి పెంచల్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా కోవూరు పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పహల్గాం దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. కోవూరు మండబైల్ సెంటర్ నుంచి బజార్ సెంటర్ వరకు శాంతి ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా నాయకుడు గండవరపు శేషయ్య, రైతు సంఘం నాయకులు బాబు, రమేష్, అప్రోచ్‌బాయ్, వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజావలీ, నాగిరెడ్డి, భారతి, వెంకటేశ్వర్లు, జై.ప్రకాష్, మాలకొండయ్య, జనజ్ఞాన వేదిక నాయకులు షేక్ ఖాజావలీ, వెంకయ్య, సీఐటీయూ నాయకులు సురేష్, విజయ్, సర్దార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

- పొదలకూరు: ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీని వీహెచ్‌పీ, బీజేపీ నేతలు నిర్వహించారు. స్థానిక రామనగర్ గేట్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. పెంచలయ్య, వేణుగోపాల్‌రెడ్డి, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



పొదలకూరులో..

క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి అభిషేకం



పొదలకూరు: రేవతి నక్షత్రాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను శనివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆనంద్, సుగుణ దంపతులు వ్యవహరించారు. పల్లకిసేవను నేత్రపర్వంగా జరిపారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

విద్యార్థులకు అభినందన



వెంకటాచలం: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన పూడిపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు దివాకర్ శనివారం అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకొని తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు.

వెంకయ్యస్వామికి పూజలు



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. రపూజలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు.

ప్రమాదభరితంగా మలుపు



పొదలకూరు: పొదలకూరు – రాపూరు మార్గంలోని మర్రిపల్లి చెరువు వద్ద ఉన్న డబుల్ రోడ్డు మలుపు వాహనచోదకులకు దడ పుట్టిస్తోంది. ఈ మలుపు వద్ద లెక్కకు మించి ప్రమాదాలు సంభవించాయి. క్షతగాత్రులైన వారు, మృత్యువాత పడిన వారూ ఉన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డును వెడల్పు చేసినా, ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. కొత్తవారు ఈ మార్గంలో వాహనాలను జాగ్రత్తగా నడపాల్సి వస్తోంది. లేని పక్షంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

- అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ

కొడవలూరు : క్షయ పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. యల్లాయపాళెం పీహెచ్‌సీ పరిధిలోని గండవరంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించి అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ బాధితులున్న ఇంట్లో ప్రతిఒక్కరికీ పరీక్షలు చేయాలన్నారు. ఎవరికైనా క్షయ ఉంటే వెంటనే సీహెచ్‌సీకి తీసుకెళ్లాలన్నారు. వారు ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడుకొంటేనే ప్రయోజనముంటుందన్న విషయాన్ని బాధితులకు సమగ్రంగా వివరించడంతో పాటు వినియోగించేలా చేసే బాధ్యత వైద్య సిబ్బందిదేనన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కామాక్షయ్య, గండవరం ఆయుర్వేద వైద్యాధికారిని ఎన్.గీతాదేవి, హెచ్ఎస్ సురేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ రోజ్‌మేరీ, ఎస్టీఎస్ సత్యనారాయణ, హెచ్‌ఏ నాగయ్య, ఏఎన్ఎం సుమతి పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం సరికాదు



వినతి పత్రం ఇస్తున్న బీసీ నాయకులు

కోవూరు : బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్‌యాదవ్‌పై తప్పుడు ప్రచారం తగదని ఆ సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం వినతిపత్రం అందజేసి తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుభాష్‌యాదవ్ బీసీ సబ్సిడీ రుణాల అవకతవకలపై విచారణ జరిపించాలని వినతిపత్రం ఇచ్చారని, అయితే విచారణ జరిగితే తమ గుట్టు బయటపడుతుందో అని పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన టైలర్ యద్దలపుడి నాగరాజు, శివప్రసాద్ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ



వెంకటాచలం: పొలాల్లో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని రాగి తీగను అపహరించిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. 30 ఎకరాల్లోని పంట పొలాలకు సాగునీటి సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. వరికోతలు నెల క్రితం ముగియడంతో పొలాల వద్దకు రైతులు వెళ్లడంలేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి, అందులోని విలువైన కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. నాలుగు రోజుల క్రితం చోరీ జరిగి ఉండొచ్చని రైతులు భావిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. దీనిపై అధికారులకు సమాచారం అందించారు.

అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్



పొదలకూరు: అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్‌ను ముత్తుకూరు మండలం నేలటూరులోని ఎస్ఈఐఎల్ ఎనర్జీలో శనివారం నిర్వహించారు. అదానీ కృష్ణపట్నం పోర్టు, ఏపీజెన్‌కో, ఎస్ఈఐఎల్ ప్రాజెక్ట్ ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించాయి. అగ్నిమాపక సిబ్బంది ఏ విధంగా స్పందించాలి.. మంటలను ఎలా అదుపుచేయాలి.. నష్టాలు జరగకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై మాక్‌డ్రిల్‌ను జరిపారు.

పార్క్‌సెంటర్‌లో మెప్మా మార్కెట్



మార్కెట్‌లో పొదుపు సభ్యులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని పార్క్‌సెంటర్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో మార్కెట్‌ను శనివారం ఏర్పాటు చేశారు. పొదుపు సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసిన పలురకాల వస్తువులు, ఆహార పదార్థాలను మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ మాట్లాడారు. మహిళలు స్వయంశక్తితో ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మిత్రభారతి సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయుడు పి.సురేంద్ర సహకారంతో 200 మంది పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిత్రభారతి సభ్యులు మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, కోదండరామయ్య, అపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాలచారి, ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం



విశేషాలంకారంలో సాయినాథుడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చెల్లాయపాళెం గ్రామంలో సాయిబాబా మందిర 13వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక సభ్యుడు పీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలో ఆధార్‌కార్డు లేని కారణంగా ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న వారి కోసం రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీహరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేబాల సచివాలయ పరిధిలో ఈనెల 28న, పెనుబల్లి, జొన్నవాడ, చెల్లాయపాళెంలో 29న, పట్టణంలోని పెద్దూరు, రామకృష్ణనగర్, వాసవినగర్, నాగమాంబపురంలో 30న శిబిరాలు జరుగుతుందన్నారు. అలాగే ఇస్కపాళెం-2 సచివాలయ పరిధిలో గాంధీనగర్, శాంతినగర్, ఇస్కపాళెం, ఖాజానగర్‌లలో మే 1న, దామరమడుగులో మే 2న, కట్టుబడిపాళెం సచివాలయ పరిధిలోని వవ్వేరు, మునులపూడి, కుట్టబడిపాళెంలో 3న ఆధార్ నమోదు, సవరణలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుచ్చిలో 2కే రన్ నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని డీఎల్ఎన్నార్ పాఠశాల నుంచి చెన్నూరు రోడ్డు వరకు ఆదివారం ఉదయం 2కే రన్ ప్రారంభిస్తామని నిర్వాహకుడు పి.కల్యాణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు దీనిని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో నగర కమిషనర్ బాలకృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని వివరించారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన అవసరం

- డీఏఓ సత్యవాణి



కొడవలూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ

కొడవలూరు: ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాలపై రైతుల్లో అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయాధికారిణి(డీఏఓ) పి.సత్యవాణి సూచించారు. మండలంలోని తాటాకులదిన్నె, కమ్మపాళెం, రేగడిచెలికల్లో రైతులకు ప్రత్యామ్నాయ పంటల ఉపయోగాలపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తాటాకులదిన్నెలో డీఏఓ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలైన నవధాన్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు పొలంలో చల్లుకోవడం ద్వారా నేలలో సత్తువ పెరిగి దిగుబడులు పెరుగుతాయన్నారు. ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. భూసారం గురించి తెలుసుకోకుండా ఎరువులను ఇష్టానుసారం ఉపయోగించడం వల్ల భూమిలోని సారం తగ్గుతుందన్నారు. ఎంత మోతాదులో ఎరువులు వేయాలో తెలియాలంటే తప్పక భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.
అనంతరం గతేడాది భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజి, డి.సుజాత, ఏఓ శ్రీలక్ష్మి, ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏలు జి.మౌర్య, ఓ.సుజిత్, డి.నవీన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగకరం

కోవూరు : భూసార పరీక్షలతో రైతులకు ఉపయోగకరమని ఏఓ ఇందిరావతి, ప్రకృతి వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి కోరారు. మండలంలోని లేగుంటపాడు గ్రామంలో శనివారం రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ దిగుబడులు పెంచేందుకు ప్రతి రైతు నవధాన్యాల సాగు విధానాన్ని పాటించాల్సిందిగా తెలియచేశారు. అదేవిధంగా భూసార పరీక్షలు కూడా చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

నమోదు చేసుకోవాలి

ఇందుకూరుపేట : ప్రతి రైతు వారి పొలాలకు సంబంధించి భూ ఆధార్ నంబర్‌ను నమోదు చేసుకోవాలని మండల ఏఓ రఘునాథ్‌రెడ్డి కోరారు. మండలంలోని జగదేవిపేటలో మట్టి నమూనాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ ఆధార్ కలిగిన రైతులకే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. భూసార పరీక్షల ద్వారా పంటలు వేసుకుంటే వ్యయ ప్రయసాలు తగ్గుతాయని, నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. వీఏఏలు పెంచలయ్య, మాధవయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : ర్యాలీ చేస్తున్న అధికారులు, రైతులు



ఇందుకూరుపేట : మాట్లాడుతున్న ఏఓ రఘునాథ్‌రెడ్డి

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం

పొదలకూరు: సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డిని స్థానిక టీడీపీ నేతలు శనివారం సత్కరించారు. ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా మండలానికి రావడంతో పార్టీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరీక్షలకు 16 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి మధుమతి తెలిపారు. 114 మందికి గాను 98 మంది హాజరయ్యారని వివరించారు.

అనధికార లేఅవుట్లపై చర్యలకు వినతి

తోటపల్లిగూడూరు: నరుకూరు పంచాయతీలో వెలసిన అనధికారిక లేఅవుట్‌పై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు. ఈ మేరకు పంచాయతీ అధికారులతో శనివారం వారు మాట్లాడారు. నరుకూరు పంచాయతీ ఎస్టీ కాలనీ సమీపంలో సర్వే నంబర్ 21 – ఏ, 21 – ఏ2లోని ఎకరాల్లో కొందరు అనధికారికంగా లేఅవుట్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. పంచాయతీ, నుడా నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా లేఅవుట్‌ను వేయడమే కాకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ప్రవల్లికకు వినతిపత్రాన్ని అందజేశారు.